క్లుప్తంగా

రోడ్డు నిర్మాణం చేపట్టక ప్రజలకు ఇబ్బందులు

జనసేన ఎంపీటీసీ మంచెం దేవి


మంచెం దేవి, వెల్ల-2, జనసేన ఎంపీటీసీ

రామచంద్రపురం రూరల్: కూటమి ప్రభుత్వంలో రోడ్ల దుస్థితిపై వెల్ల జనసేన ఎంపీటీసీ మంచెం దేవి ప్రశ్నిస్తూ రెండో బహిరంగ లేఖను ఆదివారం పత్రికలకు విడుదల చేశారు. కాగా ఇంతకు ముందు వెల్ల రోడ్డు నిర్మాణం మాట పక్కన పెట్టి కనీసం గుంతలు అయినా పూడ్చండి మహాప్రభో అంటూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఉద్దేశించి రాసిన లేఖ నియోజకవర్గంలో చర్చనీయాంశం కాగా రెండో లేఖ కూడా రోడ్ల దుస్థితిపైనే ఆమె రాశారు. మండలంలోని ద్రాక్షారామ నుంచి వెల్ల రోడ్డు, వెల్ల నుంచి వెల్లసావరం మీదుగా కందులపాలెం వరకు తలపెట్టిన మూడు రోడ్లకు రూ.2.53 కోట్లు మంజూరయ్యాయని, ఆ మేరకు శంకుస్థాపన చేసి శిలాఫలకం వేయించారు. కానీ పనులు చేపట్టక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనుల్లో జాప్యానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లలో ఎవరి నిర్లక్ష్యం కారణమో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తగిన చర్యలు తీసుకుని రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తప్పించాలని కోరారు.

పీఠంలో పవిత్రోత్సవాలు


విజయదుర్గా అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఈ నెల 26 నుంచి 28 వరకూ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. మార్గశిర బహుళ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి తిథుల్లో ఈ పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. పవిత్రోత్సవాల్లో పీఠంలో కొలువైన విజయ దుర్గా అమ్మవారితో పాటుగా, శ్రీవిజయవేంకటేశ్వర స్వామివారికి, పీఠంలోని పరివార దేవతలకు వైఖానస సంప్రదాయం ప్రకారం నిర్వహించే పవిత్రోత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గ్రామాల్లో జగన్ పుట్టినరోజు వేడుకలు

కపిలేశ్వరపురం: మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను మండలంలోని గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ సంబర వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలను చేశారు. నేలటూరు సెంటర్‌లో కేక్ కట్ చేశారు. నల్లూరులో పెద్ద ఎత్తున అభిమానులు వేడుక నిర్వహించారు. తాతపూడి దళితవాడలో స్వీట్లు పంచుకున్నారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వడ్లమూరు, టేకి, మాచర, వాకతిప్ప గ్రామాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ


ఎంపీపీ భవాని, సర్పంచ్ తుకారాం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, వేగాయమ్మపేట గ్రామ సర్పంచ్ అంబటి తుకారాం కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం పరామర్శించారు. వారి ఇంటి పెద్ద, సర్పంచ్ తుకారాం నాన్నమ్మ, ఎంపీపీ భవాని అమ్మమ్మ అయిన అంబటి జానకమ్మ మృతికి ఆయన సానుభూతి తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన జనసేన నాయకులు కొంపెల్ల రాంబాబు, తోరాటి శ్రీను ఆర్థిక సౌజన్యంతో గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వారిని గ్రామానికి చెందిన ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో పిల్లా బసవరాజు, దానేటి శరత్, శ్రీకంఠం అమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించేందుకు తీర్మానం

అయినవిల్లి: వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ప్రభల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు తీర్మానం చేశారు. ఆదివారం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ సన్నిధిలో ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు అధ్యక్షతన ప్రభల తీర్థం కోసం గ్రామసభ జరిపారు. ప్రభల తీర్థం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు గ్రామస్తులు ఏకగ్రీవం తీర్మానించారు.

అటకెక్కిన పాలన

- పోలీస్ బాస్‌లు వచ్చేదెప్పుడో?
- ఎస్సై, సీఐతో పాటు డీఎస్పీ లేని వైనం


రామచంద్రపురం పోలీస్ స్టేషన్

రామచంద్రపురం: పేరు గొప్ప ఊరు దిబ్బలా ఉంది రామచంద్రపురం నియోజకవర్గం పరిస్థితి. చెప్పుకోవడానికి మంత్రిగారి నియోజకవర్గం కానీ అమాత్యుల పాలన ఈ నియోజకవర్గంలో ఎక్కడా కానరాని స్థితి. నియోజకవర్గ కేంద్రమైన రామచంద్రపురంలో పోలీస్ అధికారులే లేకుండా గత మూడు నెలలుగా స్టేషన్‌లు పని చేస్తున్నాయి. దీంతో శాంతి భద్రతల పరిస్థితి అటకెక్కింది. గత మూడు నెలలుగా రామచంద్రపురం పట్టణానికి ఎస్సై లేరు, వచ్చిన ఇద్దరు ఎస్సైలు ఏం జరిగిందో తెలియదు కానీ వీఆర్‌లోకి వెళ్లిపోయారు. అదే బాటలో గత నెల రోజులు క్రితం సీఐ కె.అశోక్ వివాదస్పద వాఖ్యలు చేసి వీఆర్‌లోకి వెళ్లారు. కాగా ఇప్పటికే డీఎస్పీ బి.రామకష్ణ రాజమహేంద్రవరం బదిలీ కాగా ఇటీవలే రిలీవ్ అయ్యారు. దీంతో పోలీసులకు దిశా నిర్దేశం చేసేవారు లేకుండా పోయారు. నియోజకవర్గంలో పాలన ముఖ్యంగా శాంతి భద్రతల విషయంలో పోలీసులు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది.

స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన సిఫారసు లేఖ మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీన పాటి వాసు రామచంద్రపురం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం అదే నెల 5న రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కడియాల అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై వాసు మీద అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకష్టారెడ్డి టీడీపీ అధిష్టానం వద్ద ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాసు వచ్చిన వారం రోజులకే వీఆర్‌లోకి పంపించేశారు. తన నియోజకవర్గంలో తన అనుమతితో వాసును నియమించినా వీఆర్‌లోకి పంపించి వేస్తున్న సమయంలో మంత్రి సుభాష్ కిక్కురుమనకుండా ఉండటం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఇది జరిగిన సరిగ్గా 20 రోజులకు సెప్టెంబర్ 28న గతంలో అత్రేయపురం ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి వీఆర్‌లో ఉన్న ఎస్.శ్రీనివాస్ రామచంద్రపురం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. కాగా మరుసటి రోజు ఉదయమే శ్రీనివాస్ తిరిగి వీఆర్‌లోకి వెళ్లిపోయారు. రామచంద్రపురం వచ్చి ఇద్దరు ఎస్సైలు కూడా సెప్టెంబర్ నెలలోనే వీఆర్‌లోకి వెళ్లిపోవటం పోలీసు వర్గాలను విస్మయానికి గురిచేసింది. కాగా ఆది నుంచి వివాదాస్పదంగా మారిన రామచంద్రపురం సీఐ కడియాల అశోక్ వ్యవహార శైలి చివరకు వీఆర్‌లోకి వెళ్లేలా చేసింది. నవంబర్ 21న పట్టణంలో జరిగిన శెట్టిబలిజ సామాజిక వర్గ వనసమారాధనలో సీఐ పోలీస్ యూనిఫాంతో వెళ్లి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా ఆయన కూడా వీఆర్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో గత మూడు నెలలుగా ఎస్సైలు లేకపోగా సీఐ కూడా ఇక్కడ లేకుండా పోయారు. ఇదిలా ఉండగా ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా రెండు నెలల క్రితం రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణను రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. కాగా ఇటీవలే ఆయన కూడా రామచంద్రపురం నుంచి రిలీవ్ అయినట్లు తెలుస్తుంది. దీంతో రామచంద్రపురం పోలీసులకు బాస్ లేకుండా పోయారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. దానిని నియంత్రించేవారు, దిశనిర్దేశం చేసేవారు లేకుండా పోయారు. నిత్యం ప్రధాన రహదారిలో ట్రాఫిక్ విపరీతంగా ఉండటంతో వాహనదారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం బాబుల వీరంగాలు కూడా అధికంగా ఉంటున్నాయి. ఇదిలా ఉండగా రోజూ ప్రధాన రహదారిలో బైపాస్ రోడ్డు నుంచి ఆర్టోస్ ఫ్యాక్టరీ వద్ద వరకు రేస్ బైక్‌లతో హోరెత్తిస్తున్న వైనం తీవ్రంగా ఉన్న పోలీసులు మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పట్టణానికి ఎస్సైలు, లేకపోవటంతోనే ఈ పరిస్థితులుంటున్నాయనే విమర్శలున్నాయి. నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో మంత్రి ఉన్నా ఇక్కడ ఈ పరిస్థితులు రావటం చర్చాంశనీయాంశంగా మారింది.

దళితుల ఐక్యతే పీవీ రావుకు నివాళి


పడమర ఖండ్రికలో పీవీరావుకు నివాళి అర్పిస్తున్న కిశోర్

కపిలేశ్వరపురం: దళితులంతా ఐక్యంగా ఉండడమే మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావుకు ఘనంగా నివాళి అర్పించడం అవుతుందని ఆయన 19వ వర్ధంతి కార్యక్రమంలో నేతలు అన్నారు. పడమరఖండ్రికలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దళిత సమస్యలను అధ్యయనం చేయడంలోనూ, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడంలోనూ పీవీ రావు కృషి నేటి దళిత యువతకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాలింగి కృష్ణ కిశోర్, నేల రాంబాబు, నేతల సురేష్‌బాబు, కొత్తపల్లి వినోద్, మోర్త వెంకటేష్ కోనాల సురేష్, బడుగు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు రకాల పోటీలు


బహుమతులు, ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో మదర్ థెరిసా ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు

మండపేట: మదర్ థెరిసా ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక నాళం చిన భీమయ్య సత్రంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్, క్రాఫ్ట్, డ్యాన్స్, సంగీతం, మెహందీ, తెలుగు సాంప్రదాయ దుస్తులు, డిఫరెంట్ హెయిర్ స్టైల్ విభాగాల్లో వారికి పోటీలు నిర్వహించారు. మొత్తం 30 పాఠశాలల నుంచి 1500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మందపల్లి సత్యానందం తెలిపారు. వారిలో ప్రతిభ కనబరిచిన 300 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందించినట్టు తెలిపారు. తొలుత విద్యార్థులు చేసిన నృత్యాలు, మ్యాజిక్ షో ప్రేక్షకులను అలరించాయి. అనంతరం నిరుపేదలకు బియ్యం, రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. చిన్నారి నాగశైలజారెడ్డిని, సినీ ఇండస్ట్రీలో బ్యూటీషియన్‌గా రాణిస్తున్న మరో చిన్నారి విజయ నాగలలితను సత్కరించారు. తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఆర్ట్స్ క్రాఫ్ట్ విభాగాల అధ్యక్షులు కె. రామ్మోహన్, సాదా రామకృష్ణ, ఆర్ఎస్ పేట పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పైపులైన్ పనులు


ద్రాక్షారామలో రోడ్డు అంచును తొలగిస్తున్న జేసీబీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో రూ.166.50 లక్షలతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా 6.5 కిలోమీటర్ల పైపు లైన్ ఏర్పాటుకు చేస్తున్న పనులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పైపులైన్ నిర్మాణ పనులు సాధారణంగా లేబర్ (మనుషుల)తో చేపడతారు. అయితే అందుకు విరుద్ధంగా జేసీబీతో పనులు చేస్తూ సీసీ రోడ్లను ఛిద్రం చేస్తున్నారు. పైపు లైన్ ఏర్పాటు కోసం చేసే తవ్వకాలు ఒక మీటరు మేర తవ్వి, అక్కడి నుంచి సుమారు 3 మీటర్ల మేర భూమి లోపల నుంచి రంధ్రం చేసి పైపులను దొప్పిస్తారు. కానీ ఆ విధంగా కాకుండా మొత్తం రోడ్డును జేసీబీతో తవ్వి పోస్తున్నారు. రోడ్డు అంచును తొలగించకూడదని నిబంధనలు చెబుతున్నా రోడ్డు అంచును కూడా ఛిద్రం చేస్తున్నారు. బంగారంలా ఉన్న రోడ్డును పాడు చేస్తున్నారని వాటిని తిరిగి ఎవరు నిర్మిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ రోడ్లకు మరమ్మతులు చేసినా ముందులో ఉన్నంత గట్టిగా రోడ్లు ఉండవని అంటున్నారు. నిబంధనల మేరకు లేబర్‌తో పని చేయిస్తే ఇంత డ్యామేజీ ఉండదని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్సీ తోట పరామర్శ


కేశవరంలో కాలేరు రాముడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం పరామర్శించారు. తొలుత అనారోగ్యంతో బాధ పడుతున్న కాలేరు రాముడు నివాసానికి తోట వెళ్లి పరామర్శించారు. అలాగు ఇటీవల చెట్టుపై నుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సుద్దపల్లి సత్యనారాయణను కూడా ఎమ్మెల్సీ పరామర్శించారు. ఇరువురూ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మన్నె నారాయణమూర్తి, అబ్బిరెడ్డి ఆదియ్యలు మృతి చెందడంతో వారివురి నివాసాలకు తోట త్రిమూర్తులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, కేశవరం సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ (సత్తిబాబు), ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఆ పార్టీ నాయకులు పెదపాటి ఉమామహేశ్వరరావు, కొప్పిరెడ్డి ప్రసాద్, కుడుపూడి రాంబాబు, పలివెల సుధాకర్, గనిశెట్టి సత్తిబాబు, గంధం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీటిపారుదల శాఖ అధికారులు నీరు నిలుపుదల చేయనున్నారన్నారు. అయితే ఈ ఏడాది వర్షాల కారణంగా తీవ్ర జాప్యం జరుతుందని కనీసం ఈ నెలాఖరు నాటికైనా పూర్తి స్థాయిలో వెదచల్లికలు, నాట్లు పూర్తి చేయాలన్నారు. దాళ్వా సాగుకు సమయం తక్కువ ఉన్నందున రైతులు వెదచల్లిక విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని తక్కువ రోజుల్లో కోతకు వచ్చే పంట రకాల వరిని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి, నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

సమస్యల ద్వారం ద్వారపూడి

- గ్రామంలో పారిశుధ్యం అధ్వానం
- స్వైరవిహారం చేస్తున్న కుక్కలు


ద్వారపూడిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు


ద్వారపూడి గ్రామం వీధిలో గుమిగూడిన కుక్కలు

మండపేట: మండలంలో మేజర్ పంచాయతీ ద్వారపూడి. వ్యవసాయంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ గ్రామాన్ని పలు సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. సుమారు 20 వేల జనాభా గల ద్వారపూడిలోని ఏ వీధిలో చూసినా చెత్త దర్శనమిస్తుంది. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజారోగ్యం ప్రమాదంలో ఉంది.

గ్రామ ప్రాముఖ్యతలివీ...

మేజర్ పంచాయతీ అయిన ద్వారపూడి అభివృద్ధికి వనరులు పుష్కలంగా ఉన్నాయి. పంచాయతీకి ఆదాయ వనరులూ ఎక్కువే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండో అతిపెద్ద వస్త్ర మార్కెట్‌తో పాటు, గ్రావెల్ నిక్షేపాలు ఉన్నాయి. మరోపక్క పౌల్ట్రీస్ నిర్వహణ, ఎఫ్‌సీఐ గోదాముల ద్వారా పంచాయతీకి దండిగా ఆదాయం వచ్చి చేరుతోంది. ఏడాదికి ఇంచుమించుగా కోటి రూపాయల వరకూ పంచాయతీకి ఆదాయం వస్తోంది.

సమస్యలిలా...

ద్వారపూడి గ్రామంలో సమస్యలు కూడా మేజర్‌గానే వున్నాయి. కుక్కలు, పందుల సంచారం ఎక్కువ. ఏ వీధిలో చూసినా పారిశుధ్యం లోపించింది. అయినప్పటికీ పంచాయతీ అధికారులు చూసీచూడనట్టు ఉంటున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఒకపక్క కుక్కలు, మరో పక్క పందులు వీధుల్లో సంచరిస్తున్నాయి. పంచాయతీకి పారిశుధ్య కార్మికులు అరకొరగా ఉన్నారు. నిర్వహణా పరమైన లోపాల వల్ల ప్రధాన కూడళ్లలో కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. విడతల వారీగా కార్మికులు వారానికి ఒకసారిగా ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకొని పని విభజనతో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్నారు. శుభ్రం చేసిన రోజుల మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో జనావాసాల మధ్య చెత్త పోగుబడి దుర్గంధం వ్యాపిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. పేరుకున్న చెత్తను వీధి కుక్కలు, పందులు చిందరవందర చేస్తున్నాయి. బంగారమ్మ కాలనీ సమీపంలోని చెరువు వద్ద పందుల ఆవాస కేంద్రాలు ఉండడంతో అక్కడి నుంచి రాత్రిళ్ళు పందులు ఊరిమీద కొస్తున్నాయి. దారిన వెళ్తున్నవారిని కుక్కలు వెంబడిస్తూ పరిగెట్టిస్తున్నాయి. దీంతో చిన్నారులు, మహిళలను భయాందోళనకు గురవుతున్నారు. సమస్యలపై పంచాయితీ అధికారులు ఇప్పటికైనా స్పందించి దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీసీ బాలికల గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్


బీసీ బాలికల గురుకుల పాఠశాల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రామచంద్రపురం రూరల్: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం వెలంపాలెంలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే ఏపీ బీసీ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. బాలికల వసతి గృహ స్థితిగతులు, కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా? తరగతుల నిర్వహణపై స్వయంగా పరిశీలిస్తూ విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూలో సూచించిన ఆరోగ్యవంతమైన ఆహారం విద్యార్థినులకు అందించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, వంట గది, డైనింగ్ హాలు తదితర సౌకర్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్నప్పుడు శ్లాబు లీకై గదుల్లోని నీరు వస్తుందని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భవనం పాతదైనందున వేరే ప్రైవేటు భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో విద్య అభ్యసించి ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, తహసీల్దార్ ఎం.సావిత్రి, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలది కీలక భూమిక

మంత్రి సుభాష్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో ఆదివారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇన్ కోనసీమ పేరిట నిరుద్యోగ యువతీ యువకులకు ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకై అవగాహన సదస్సును నిర్వహించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు వినూత్న ఆలోచనలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తే అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా పరిశ్రమల స్థాపన ఒక ఆచరణీయ వృత్తిగా ఎంచుకునే వారిని అన్ని విధాలా ప్రోత్సహించాలన్నారు. నిరుద్యోగ యువత ఆలోచనలకు అనుగుణంగా వారికి ఆసక్తి ఉన్న రంగంలో పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు దరఖాస్తు దగ్గర నుంచి రుణాల కల్పనతో పాటుగా రాయితీలతో ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపన దిశగా అన్ని దశల్లో పూర్తి సహకారం అందించేందుకు సిబ్బందిని బృందాలుగా నియమిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటులో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అదనపు ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. ముందుగా నిరుద్యోగ యువత వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలియజేస్తే ఆ దిశగా టీములు ఆయా రంగ పరిశ్రమల ఉత్పత్తి విధి విధానాలపై అవగాహనను పెంపొందిస్తారని తెలిపారు. నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని వాటి ఆధారంగా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు నిండుగా ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రాథమిక సెక్టార్ అయిన వ్యవసాయ అనుబంధ రంగాలు ఉన్నప్పటికీ రెండో సెక్టార్ పారిశ్రామికంగా అంతంత మాత్రమే ఉందని ఈ ఎంఎస్ఎంఈ ద్వారా మరిన్ని పరిశ్రమలు రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో డి.అఖిల, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, తహసీల్దార్ సావిత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి ప్రారంభం


గొల్లపాలెం గ్రామ వీధుల్లో కీర్తనలు ఆలపిస్తున్న హరిదాసు

కాజులూరు: మండల గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ఆంధ్రుల ప్రధాన పండగ అయిన ఈ సంక్రాంతి పండగలో హరిదాసుల గ్రామ సంచారాలకు ప్రాధాన్యం ఉంటుంది. ఏటా ధనుర్మాసం నెల రోజుల పాటు గ్రామాల్లో హరిదాసుల సందడి ప్రారంభమవుతుంది. వాస్తవానికి ఈ హరిదాసులు రాకతోనే గ్రామాల్లో సంక్రాంతి నెల ప్రారంభమైనట్టుగా ప్రజలు భావిస్తుంటారు. గ్రామాల్లో భోగి పండగకు సరిగ్గా నెల రోజుల ముందు నుంచి హరిదాసుల హడావుడి ప్రారంభమౌతుంది. తెల్లవారగానే హరిదాసు భక్తి కీర్తనలతో ప్రజలను మేలుకొల్పుతుంటారు. ×హరిలో రంగహరి× అంటూ భక్తిపాటలతో వీధుల్లో హరిదాసు తిరుగుతుంటే పిల్లలు, మహిళలు బియ్యం తీసుకువెళ్లి హరిదాసుకు సమర్పిస్తున్నారు. ప్రతి గ్రామంలో హరిదాసు కీర్తనలు మార్మోగుతూ ప్రజలను మేలుకొల్పుతున్నాయి. ధనుర్మాసంలో గ్రామాల్లో హరిదాసు తిరుగుతూ భక్తికీర్తనలు ఆలపించడం ద్వారా పాడి పంటలు వృద్ధి చెందే, ప్రజలు సుఖ శాంతులతో ఉంటారని పల్లెవాసుల విశ్వాసం. ప్రతిరోజు బియ్యం సమర్పించడంతో పాటు సంక్రాతి పండగల్లో కొందరు హరిదాసులకు పిండివంటలు బట్టలు కానుకలుగా సమర్పిస్తుంటారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి


క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కాజులూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

కాజులూరు: మండల గ్రామాల్లో క్రిస్మస్ సందడి కొనసాగుతుంది.ఈనెల 25న క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ముందస్తుగానే క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. క్రైస్తవులు తమ ఇళ్లపై క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేయగా పలువురు తమ ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇక గ్రామాల్లో చర్చిలైతే మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. గత వారం రోజులుగా మండలంలో ప్రతి రోజు ఏదో ఒకచోట ప్రత్యేక ప్రార్థనలు, సువార్త కూటములు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గుర్తింపు పొందిన పాస్టర్లు వచ్చి బైబిల్ సారాంశాలను, ఏసుక్రీస్తు జన్మరహస్యాలను భక్తులకు వివరిస్తున్నారు. బుధవారం క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని మండల పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు పి.శ్యాంసన్ తెలిపారు. దాదాపు జనవరి ఒకటో తేదీ వరకూ క్రైస్తవులు మండల గ్రామాల్లో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు.

పలువురికి సేవా పురస్కారాలు


ద్రాక్షారామ మార్కెట్ యార్డులో దాత సత్తి సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ద్రాక్షారామ వాకర్స్ క్లబ్ సభ్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ మార్కెట్ యార్డులో ఆదివారం ద్రాక్షారామ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గురు విశిష్ట వ్యక్తులకు సేవా పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. 2012లో జిమ్‌ను ఏర్పాటు చేసి ఎటువంటి ఫీజులు తీసుకోకుండా ఉచితంగా శిక్షణ ఇస్తూ ఎంతో మందికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు రావడానికి దోహదం చేసిన అన్నాయిపేట మాజీ సర్పంచ్ పొట్టిపోతుల రామకృష్ణను ఉత్తమ క్రీడా సేవా పురస్కారంతోను, అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండదండలు అందిస్తూ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి రూ.2.50 కోట్లతో అన్నదాన భవనం నిర్మించిన దాత సత్తి సుబ్బారెడ్డిని ఉత్తమ ఆధ్యాత్మిక సేవా పురస్కారంతోను, అదే విధంగా కరోనా సమయంలో అనేక మందికి వైద్య సహాయం అందించి ఎన్నో ప్రాణాలకు కాపాడిన మాధవరపు వెంకటేశ్వర్లును ఉత్తమ వైద్య సేవా పురస్కారంతోను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, అన్నాయిపేట సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి, డిస్ట్రిక్ట్ గవర్నర్‌లు చదరం శివాజీ, చప్పా నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.